# ఎమ్మెల్యే నరేంద్ర వర్మపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

- జనసేన నాయకుల హెచ్చరిక
- కూటమి ఐక్యతను దెబ్బతిసే కుట్రలను తిప్పికొడతాం
- మామిడాల రామాంజనేయులు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన జనసేన నేతలు

**బాపట్ల : ఏప్రిల్ 20 (ప్రజా వీక్షణం) :**

బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు హుందాతనాన్ని,వారి నాయకత్వాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు.మామిడాల రామాంజనేయులు చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగతమైనవి కావని,అవి కూటమి ఐక్యతపై చేస్తున్న దాడిగా పరిగణించాలని వారు పేర్కొన్నారు.సోమవారం బాపట్ల పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి,బాపట్ల తూర్పు సత్రం చైర్మన్ గుంటుపల్లి తులసికుమారి మాట్లా డుతూ.... .బాపట్ల నియోజకవర్గంలో టీడీపీ – జనసేన – బీజేపీ శ్రేణులు సమన్వయంతో ముందుకు వెళు _న్నాయని అన్నారు.ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పార్టీలకతీతంగా అందరిని కలుపుకుపోతుంటే,కొందరు పనిగట్టుకొని కులాల మధ్య,నాయకుల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు.సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన మామిడాల రామాంజనేయులు వెనుక ఎవరున్నారో ఆరా తీయాలన్నారు. పిఠాపురం నియోజకవర్గ టీడీపీ నాయకులు వర్మని,బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజుని విమర్శించే స్థాయి మామిడాల రామాంజనేయులుకు లేదని మండిపడ్డారు. జనసేన పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షులు,బాపట్ల మార్కెట్ యార్డు డైరెక్టర్ గొట్టిపాటి శ్రీకృష్ణ,జనసేన బాపట్ల పట్టణ నాయకులు కారుమూరి ఆంజనేష్ లు మాట్లాడుతూ .....రాజకీయాల్లో విమర్శలు,ప్రతి విమర్శలు సహజమని,కానీ కుటుంబాలను,వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం నీచమైన చర్య




అని ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వంలో సోషల్ మీడియా ముసుగులో అరాచకాలు చేసే వారిపై కఠినంగా ఉంటామని,ఐటీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.రాబోయే రోజుల్లో తెలుగుదేశం – జనసేన –బీజేపీ నాయకులు ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహించి తమ ఐక్యతను చాటిచెబుతామని,ఇటువంటి పోస్టుల వల్ల కూటమి నాయకుల మధ్య దూరం పెరగదని స్పష్టం చేశారు.ఈ అసత్య ప్రచారాలను బాపట్ల ప్రజలు గమనిస్తున్నారని, అబద్ధాలతో రాజకీయం చేసే వారికి కాలమే సమాధానం చెబుతుందని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో జనసేన పార్టీ బాపట్ల మండల అధ్యక్షులు దాసరి ఏసుబాబు,జనసేన నాయకులు,జనసైనికులు పాల్గొన్నారు.

# సేవాపథంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

- శివాలయంలో పూజలు

ఆసుపత్రిలో పండ్ల పంపిణీ.. - సేవలోనూ.. సంబరంలోనూ

శీలం వెంకటేశ్వరరావు అగ్రగామి!





**టీ. నర్సాపురం:ఏప్రిల్ 20 (ప్రజా వీక్షణం)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు సందర్భంగా ఏలూరు జిల్లా టీ. నరసాపురం మండలంలో శీలం వెంకటేశ్వరరావు నేతృత్వంలో కన్నులపండువగా జరిగాయి. రాజకీయ వేడుకలకే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాలతో ఈ దినోత్సవాన్ని నిర్వహించడం విశేషం.

మండల అభివృద్ధి ప్రదాతగా పేరున్న శీలం వెంకటేశ్వరరావు, సోమవారం రోజున ఉదయం ముందుగా స్థానిక శివాలయానికి చేరుకున్నారు. చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, రాష్ట్రానికి మళ్ళీ ఆయన నాయకత్వం లభించాలని కోరుకుంటూ ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

**రోగులకు పండ్ల పంపిణీ**

**- మానవత్వం చాటుకున్న నేత**

పూజా కార్యక్రమాల అనంతరం, శీలం వెంకటేశ్వరరావు తన అనుచర వర్గంతో కలిసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి తాజా పండ్లు, బట్టర్ మిల్క్ (మజ్జిగ) అలాగే బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పేద ప్రజల కష్టాల్లో తోడుండటమే తమ నాయకుడు చంద్రబాబు నేర్పిన సిద్ధాంతమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

అనంతరం మండల కేంద్రంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ వేడుకలో నినాదాలతో హోరెత్తించిన కార్యకర్తలు, బాబు నాయకత్వం పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నరు.

ఈ కార్యక్రమంలో టీ నర్సాపురం మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వెలిది నాగబాబు, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దావులూరు సూర్యనారాయణ, టీ నర్సాపురం సొసైటీ చైర్మన్ జోనుబోయిన సోంబాబు, మక్కినవారి గూడెం సొసైటీ చైర్మన్ ఆచంట సూర్యనారాయణ, పోలవరం నియోజకవర్గ తెలుగు యువత



అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, టీ నర్సాపురం మండల తెలుగు యువత అధ్యక్షులు కాల్నేడి శ్రీనివాస్ (వాసు), టీడీపీ మండల సీనియర్ నాయకులు కాల్నేడి రాంబాబు గారు, టి నర్సాపురం టీడీపీ గ్రామపంచాయతీ అధ్యక్షులు కొల్లి రమేష్ , లవంకుల శ్రీ రంగ వర ప్రసాద్, ఏపిగుంట గ్రామ పంచాయతీ టీడీపీ అధ్యక్షులు సాధనాల బుసిబాబు ,సంక్రాంతి సతీష్ , రమేష్ వర్మ, కురసం రామచంద్ర రావు, టీ నర్సాపురం సొసైటీ డైరెక్టర్ మోదుగు రామారావు, జోనుబోయిన భాష, మాజీ సర్పంచ్ జలపాల్ , వాసిరెడ్డి మోహన్ , గంట సతీష్ , టీ నర్సాపురం నీటి సంఘం అధ్యక్షుడు మోహన రావు , మరియు టీడీపీ నాయకులు కార్యకర్తలు మరియు కూటమి నాయకులు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు..

# కర్ర సంచులు,గొడుగులు అందజేసిన రజని

**బాపట్ల : ఏప్రిల్ 20 (ప్రజా వీక్షణం) :**

బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామంలోని ఎస్టీ కాలనీలో సోమవారం సమాజ సేవకురాలు బండ్రెడ్డి రజని వృద్ధులకు గొడుగులు మరియు పాదరక్షలు అందజేశారు.అదే విధంగా మహిళలకు కర్ర సంచులు మరియు మజ్జిగ పాకెట్ లను అందజేశారు.ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ...వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది కాబట్టి బయట ప్రదేశానికి వెళ్ళేటప్పుడు గొడుగులు మరియు పాదరక్షలు తప్పకుండా వేసుకొని వెళ్లాలని సూచించారు.ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకుని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని అన్నారు.



# బాటసారులకు,విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

**బాపట్ల : ఏప్రిల్ 20 (ప్రజా వీక్షణం) :**

బాపట్ల జిల్లా వేటపాలెం మండలం సంపత్ నగర్ దగ్గర మూడు రోడ్ల సెంటర్ లో కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్విని మరియు మైల రంగయ్య వీరి ధర్మపత్ని లక్ష్మి సహకారంతో 450 మంది బాటసారులకు మరియు పాఠశాల విద్యార్థులకు ఫౌండేషన్ చైర్మన్ వెంకట అశ్విని మజ్జిగ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ వెంకట అశ్విని మాట్లాడుతూ...కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో పెరిగిపోతున్న ఎండల తీవ్రతతో అల్లాడిపోతున్న బాటసారులకు మరియు విద్యార్థులకు దాతలు పంపిణీ చేస్తున్న చల్లని మజ్జిగ ఎంతో ఊరటనిస్తుందన్నారు.ప్రస్తుత వేసవి కాలంలో ఎండలు మండిపోతున్నాయని, ప్రజలు, విద్యార్థులు డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.









# చంద్రబాబు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి కొండపల్లి రవి

**టి. నర్సాపురం:ఏప్రిల్ 20 (ప్రజా వీక్షణం)**





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గ రాష్ట్ర కార్యదర్శి కొండపల్లి రవి నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాయి.మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొండపల్లి రవి కేక్ కట్ చేసి, పార్టీ కార్యకర్తలు మరియు నాయకులకు మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొండపల్లి రవి మాట్లాడుతూ...చంద్రబాబు నాయుడు కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దిక్సూచి అని కొనియాడారు. పేదరికం లేని సమాజం కోసం ఆయన పడుతున్న తపన అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన మరిన్ని విజయాలు సాధించి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



# న్యాయవాదులపై దాడులను నిరసిస్తూ విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 20 (ప్రజా వీక్షణం)**

రాష్ట్రంలో ఇద్దరు న్యాయవాదుల హత్యలు, మరో న్యాయవాదిపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి నాయకత్వంలో న్యాయవాదులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అప్పిరెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు చెందిన ఎల్లయ్య, ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీరామ హరి ప్రసాద్ హత్యలు హేయమైన చర్యలని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాకు చెందిన న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డిపై జరిగిన దాడి న్యాయవాదుల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆవేదనను వ్యక్తం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ వృత్తి ధర్మాన్ని పాటిస్తూ సమాజానికి న్యాయం అందిస్తున్న న్యాయవాదులపై దాడులు జరగడం హేయకర మైనచర్య అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం అమల్లో ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అటువంటి చట్టాన్ని వెంటనే తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు గోళ్ళ చంద్రశేఖర్ మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం న్యాయవాదులు ఆర్డీవో మరియు డీఎస్పీ



కార్యాలయాలకు వెళ్లి డీఎస్పీ విశ్వనాథ్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ కుండల కనకదుర్గ మహాలక్ష్మి, కార్యవర్గ సభ్యులు తెన్నేటి జగ్జీవన్, బురిడి శ్రీనివాస్, శనివారపు వెంకట రామకృష్ణ, ఎం. సౌదామిని, సీనియర్ న్యాయవాదులు అరిటాకుల దశరధరామ్, డి.ఎన్.ఎస్. రవిప్రసాద్, ఎస్.ఎం.బి. భాషా, యడవల్లి మణికంఠ, పెనుగొండ నాగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి లో గ్రాడ్యుయేషన్ డే

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 20 (ప్రజా వీక్షణం న్యూస్)**

హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం సిద్ధపురం గ్రామం లోని అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దాపూర్ గ్రామ సర్పంచి బొక్క హరీష్ అంగన్వాడి సెంటర్లో పూర్వ ప్రాథమిక విద్య అభ్యసించిన పిల్లలు పాటలు, కథలు పాడారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ అంగన్వాడీ కేంద్రంలో విద్య పూర్తి చేసుకున్న పిల్లలని ప్రాథమిక పాఠశాలలో మెరుగైన విద్య కోసం చేర్పించాలని అన్నారు. అనంతరం పిల్లలకి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఏఎన్ఎం ఆశ వర్కర్లు, వార్డు సభ్యులు టీచర్స్ స్రవంతి లక్ష్మి పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఆరుగోలనులో ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 20 (ప్రజా వీక్షణం)**

ఆంధ్రప్రదేశ్ రూపశిల్పి, అమరావతి నిర్మాణ ప్రదాత, నవ్యాంధ్ర రథసారథి, రాజకీయ దురంధరుడు, మహా జ్ఞాని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ పుట్టినరోజు వేడుకలను తాడేపల్లిగూడెం మండలంలోని ఆరుగొలనులో సోమవారం ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో వర్ధిల్లి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని శివాలయంలో పూజలు, చర్చిలో ప్రార్థనలు, మసీదులో నమాజ్ సర్వమత ప్రార్థనలు చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వట్టూరి రాంబాబు, కసకాని రాజేష్, గరపాక మూర్తి, మలక వెంకట్రావు, షేక్ సాయి, మేళం గాంధీ, షేక్ సమీర్ & హసన్, గెడ్డం చరణ్, వీరమల్లు శ్రీను, షేక్ మీరా, వీరమల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# యర్రాయమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**- సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరావు**

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 20 (,ప్రజా వీక్షణం)**

కామ్రేడ్ పూడి యర్రాయమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు సూచించారు. సిపిఐ సీనియర్ నాయకురాలు, ఎ.పి.మహిళా సమాఖ్య మాజీ జిల్లా సమితి సభ్యురాలు పూడి యర్రాయమ్మ 16వ వర్ధంతి కార్యక్రమాన్ని యాగర్లపల్లిలోని ఆమె స్మారక స్థూపం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ యర్రాయమ్మ నాటి తరం మహిళా సమాఖ్య నాయకులు వంకా నాగమణి, బోణం ధనలక్ష్మి తదితరులతో కలిసి పనిచేశారని గుర్తు చేశారు. తన భర్త పూడి సుబ్బారావు అడుగు జాడల్లో నడిచి పార్టీ నిర్మాణంలోనూ, ఉద్యమాల్లోను కీలకంగా పనిచేశారన్నారు. పేదలకు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇంటి పట్టాలు, పింఛన్లు, విమానాశ్రయం భూముల పంపిణీ, సంపూర్ణ మద్యపాన నిషేధం ఉద్యమాల్లో ఆమె చురుకైనా ఉద్యమాలు చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాదాసు సత్యనారాయణ, షేక్ షానూర్ భాషా, చలుమూరి సాయి, సప్పా చిన్నా, పూడి నాగేశ్వరరావు, పెంట అప్పలనాయుడు, పెద్దింటి సత్యనారాయణ, పూడి వెంకట్రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# బంగారు గొలుసును లాక్కొని పరార్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 20 (ప్రజా వీక్షణం న్యూస్)**

సోమవారం ఉదయం 10 గంటల సమయంలో హన్మకొండ లోని ఎక్సైజ్ కాలనీ పరిధిలో వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపం లో ఒక గొలుసు దొంగతనం సంఘటన చోటుచేసుకుంది.వివరాలలోకి వెళ్తే చింతల కల్పన, భర్త ప్రదీప్ రెడ్డి, వయస్సు (54) కులం: రెడ్డి, వృత్తి: గృహిణి, నివాసం: ప్లాట్ నెం.102, ఎక్సైజ్ కాలనీ, హన్మకొండ. ఉప్పు ప్యాకెట్ కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వెళ్తుండగా, ఎదురు దిశ నుండి మోటార్ సైకిల్ పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె వద్దకు చేరుకొని, ఆకస్మికంగా ఆమె మెడలో ఉన్న సుమారు 28 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఈ సమాచారం అందుకున్న సుబేదారి ఇన్స్పెక్టర్ సంఘటన స్థలానికి చేరుకొని, స్థల పరిశీలన నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సి ఐ రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యం

**- పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు**

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 20 (ప్రజా వీక్షణం)**

ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యమని పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను (అర్జీలు) స్వీకరించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పట్టణ ప్రజానీకానికి ఎటువంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల నుంచి డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, ఆస్తి పన్ను, పారిశుధ్యం వంటి సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని సంబంధిత శాఖాధిపతులకు తెలియజేశారు., వచ్చిన ప్రతి ఫిర్యాదును నిర్ణీత గడువులోగా పరిష్కరించి, బాధితులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా చూస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రవి సుధాకర్, డిఈ వెంకటరమణ, టిపివో వీరమల్లు జగదీశ్వరరావు, ఐసీడిఎస్ సూపర్వైజర్లు దుర్గా భవాని, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.




# హర్మూజ్ వద్ద నౌకలకు నేవీ అడ్వైజరీ

**- అనుమతి ఇచ్చే వరకు వెళ్లొద్దన భారత నేవీ**

**- రష్యా చమురు దిగుమతికి బీమా సంస్థల సేవలకు అనుమతి**

**న్యూఢిల్లీ,ఏప్రిల్20 (ప్రజా వీక్షణం)**

హర్మూజ్ జలసంధిలో భారత జెండాతో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన నేపథ్యంలో భారత పతాక నౌకలకు మన నౌకదళం అడ్వైజరీ జారీ చేసిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని, తమనుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే హర్మూజ్‌లో ప్రయాణించాలని నేవీ పేర్కొంది. ఆ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న నౌకల భద్రతను నిర్ధారించేందుకే ఈ సూచనలని. లారక్ ద్వీపం హర్మూజ్‌కు సమీపంలో ఉంటుంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి 11 నౌకలు ఈ జలమార్గాన్ని దాటాయి. దానిని దాటిన చివరి ట్యాంకర్ దేశ్ గరిమ . అదే రోజు జగ్ అర్ణవ్, సన్మార్ హెరాల్డ్ ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా.. ఇరాన్ బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనను విదేశాంగశాఖ ఖండించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ఈ ఘటనపై నిరసనను తెలియజేసింది. గతంలో తమ దేశానికి బయల్దేరిన అనేక నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఇకపోతే భారత్‌కు చమురు సరఫరాలో ఆటంకాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. తాజాగా రష్యా నుంచి చమురు దిగుమతికి అవసరమైన బీమా సేవలను విస్తృతం చేయాలని నిర్ణయించింది. దీనిలోభాగంగా 11 రష్యా బీమా సంస్థలకు భారత్‌లో అనుమతులు మంజూరు చేసింది. వాస్తవానికి ఈ సంస్థలు నౌకా రవాణాలో బీమాలను అందించే పీ అండ్ ఐ క్లబ్స్ (ప్రొటెక్షన్ అండ్ ఇండెమ్నిటీ)లో మెంబర్స్ కాకపోవడం గమనార్హం. ఇరాన్-అమెరికా పోటీపడి హర్మూజ్‌ను దిగ్బంధించడంతో చమురు నౌకలు ఈ జలసంధిని దాటడం చాలా కష్టంగా మారింది. మరోవైపు రష్యాకు చెందిన చాలా చమురు నౌకలు ఈ మార్గంలో కాకుండా ఎర్ర సముద్రం మీదుగా ఆసియాలోని తమ గమ్యస్థానాలకు చేరతాయి. అందుకే భారత్ మాస్కో వైపు మొగ్గు చూపింది. వీటిల్లో గ్యాస్‌ప్రోమ్ ఇన్స్యూరెన్స్, రోస్‌గోస్‌ట్రాక్, బ్యాలెన్స్, సోగ్లాసీ, ఉగోరియా గ్రూప్, స్బెర్‌బ్యాంక్, ఏఎస్‌టీకే బీమా సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు గత వారం అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ కూడా అనుమతులను పొడిగించింది.

# పాఠశాల కార్మికులను సన్మానం చేస్తున్న సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాశ్ ..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 20(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్పేట్ మండలం గుంట్లపేట్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాశ్ సందర్శించి, పాఠశాలలో పని చేస్తున్న కార్మికులను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మాటాడుతూ పాఠశాలలో వంట మనిషి బాయమ్మ విద్యార్థులకు ప్రతి రోజు రుచికరమైన మధ్యాహ్న భోజనం ,అందిస్తునందుకు క్యావంజర్లు బిక్కమ్మ, దంజయ్ లను పాఠశాల గదులను, ఆవరణలో పరిశుభ్రతంగా ఉంచుతున్నందుకు వారి సేవలను గుర్తించి వారిని అభినంధించి ఉపాధ్యాయుల సమక్షంలో వారిని సన్మానం చేయడం జరిగిందని అన్నారు , అదే విధంగా విద్యార్థులు వేసవి సెలవు దృష్టిలో ఉంచుకొని వాగులు, పాడుబడ్డ బావుల వద్ద స్నానం చేయటానికి వెళ్ళద్దని పెరుగుతున్న ఎండల ఉష్ణోగ్రత్త కారణంగా అరుబయట వెళ్లకుండా ఇంటి వద్ద ఇంటి మంచిగా చదువుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయురాలు రోజ, విద్యార్థులు పాల్గొన్నారు.



